# మన్వంతరం

"శిఖిముఖి"

## ఉపోద్ఘాతం

హంసతూలికాతల్పం కాదు గాని అలివేణికి తగ్గ పాన్పు. సెజ్జ కేను మల్లెపూలెత్తున వలపుతలపులలో తల తేలిపోతూంటే, పలుకే బంగారమయిన ప్రౌఢను బిడియంగా జడిసి, కథ పేరడగకుండా నే సాగిపోతోంది.

ఉలకని, పలకని ఉనిద ఉన్నట్టుండి, చటుక్కున చక్కిలి గింతలు పెట్టే యౌవనాన్ని "ఊఁ, పోదూ, మరీనూ!" అన్నట్టు ఒళ్లు విరిచి కసిరింది! నిరీక్షణలో నిమేషాలు దేవమానకాలమంత దీర్ఘాలయేటప్పటికి, ఆత్రత మించి శ్రుతిలోబడింది. అయినా, రాగంరాని భోగంచాన ఉంటుందిటండీ?

ఎవరికోసం ఎవరికోసం ?
పందిమంలో గండుకోయిల
పాడి కూసే దెవరికోసం ?
పూలవాసన కమ్మతెమ్మెర
లాడి వీచే దెవరికోసం ?

ఆరోహణంలో అసహనం తలకెక్కి కంపించింది వీణ. తన పేరెత్తదేం?...తనే ఓమెట్టు దిగి, అమరసింహుని అండజూసుకుని, మేళవింపులో ముచ్చట తీర్చుకుంది.

క్వాణ నిక్వాణ క్వణన నాదం
వీణ పాడే దెవరికోసం ?
మానసాబ్జమృణాళతంత్రీ
మూర్ఛనా లవి ఎవరికోసం ? ..

ఎక్కడో మగని పొలుపు తెలిపే ఒక మారుత మొలయగా జంత్రగాత్రాల గాంధర్వం వెన్నతో నేర్పిన విద్దెం-విద్దెం-గా మెట్టూ స్థాయీ దిగింది.

ఎనభైనాలుగు వేల రాగాల బరువునే దిగదించి దిగమింగింది గాయని. పాన్పుదిగి, ఉద్వృత్తగా నిలబడి కన్నుపొడుచుకున్నా కనబడని అంధకారంలో నెలపొడుపుకోసం నిదానించి మాసింది.

శ్యామాకాశం చీకట్లని చెరిగిపొయ్యగా, పుట్టెడు శనగలలో ఒకటే రాయిలాగ బయటబడ్డాడు బహుళ

---

* * కృతిచెయ్యడంమీద మోజు కలిగి, Modus Operandi కోసం కవితాపితామహుణ్ని కదలేసేను. కావలసిన హంగులు చెప్పమంటే, "నిరుపహతిస్థలంబు" అని ఆరంభించేడు ఆయన.

"ఏమిటీవరస?" అని అడ్డొచ్చి గద్దించేడు కవిసార్వభౌముడు, బుద్ధికి బృహస్పతంతటివాడుకూడా బేజారెత్తిపోయేటట్టు. "భోజనం ముందే తాంబూల మడుపుతా వేమయ్యా, భోగాలెరగని వాడికి మల్లే? నన్ను చూడు. కలనాటి అలవాటుప్రకారం కాని రోజులలోకూడా క్రమం తప్పలేదు. బట్ట, బత్తెం, బొట్టు, భోజనం......విన్నావా?" అని వినిపించేడు రత్నాంబరాలనుంచి హేమపాత్రాన్నంవరకూ నడిచిన వరస.

పెద్దన పెద్దరికానికి పెద్ద ఇదిగా కోపం వచ్చింది. "బొట్టు భోజనాన్ని చెరిపినా బెట్టుసరి మానలేదా?" అని చీవాట్లేసేడు.

"విశ్వస్తచేతి వెల్లుల్లి వడ్డనలు తిన్నవాడివి, నా తాంబూలంసంగతి విని తగవుకి వచ్చేవా?"

"వెల్లుల్లి తిన్నా, వీథినాటకం రాసినా, నా గొప్పకి తప్పిదాలు పట్టేవాడెవడు?" అన్నాడు కవిరాజు. "రుచులు దోసమని పోనాడినా, రసాలకు దోషం రానియ్యలేదు, తెలుసునా? ఇక తాంబూలాలా? సత్కారంలో క్రమం తప్పనియ్యని కవిసమ్రాట్టును, వేసుకోవడం విషయంలో వరసతప్పని విలాసపురుషుణ్ని. కనక కొత్త చెప్పిపోదామని వస్తే కస్సుమంటా వేమిటయ్యా?" అని చక్కాపోయాడు.

పెద్దనతో పేచీపడడాని కంతా పెద్దలే! అనుకుంది, ఈ వాదం విని విస్తుపోయిన మాకథానాయిక,

"ఛా" నన్నాడు నాయకుడు. పడితే పెద్దనతోనే పడాలి పేచీ, అన్నాడు. మాధురీమహిమ నెపంపెట్టి "మాటమాత్రానికి" మరో కవిపక్షం జేరేడు.

విదియ చంద్రుడు. దూరాన అరుంధతి చక్కని చుక్క లాగ మెరిసింది.

వెన్నెలని వెతికిన చకోరాక్షికి రాడేమో అనిపించిన అనుమానపు నీడలాగ చూచాయగా గోచరుడయాడు వచ్చినాయన. తేరిపార జూసేటప్పటికి ధృవుడై ముంగల నిలబడ్డాడు.

"వచ్చేవా విప్రవరా"-ప్రశ్నార్థకం తోపించని గొంతుతో నిస్సందేహంగా అడిగిందామె.

అపృష్టుడు నిరుత్తరంగా నవ్వేడు.

"ధూర్జటిలాగ తియ్యగా మాట్లాడడం నేర్చుకుందామని..." సహేతుకంగా మాటలు మిగిలేడు.

"హాఁ! తెలిసెన్!" అంది—"పెద్దన పోకడలతో పేచీపడ్డావూ?"

"అలసానిదాని అలక గజిబిజి చేస్తే, అల్లసాని వాని అల్లిక జిగిబిగిలో ఎన్ని వసంతాలని గడుస్తాయి?"

ఎన్నా?-మన్నా అన్న విన్యాసంలో అతని చుట్టూ కైవారం చేసేయి కోమలిచేతులు. కాని ఆ శ్లేషంలో అర్ధ్రచిత్తయైన అతివకి పెల్లుబికిన జాలి ముంచెత్తుకువచ్చింది.

పెద్దనతో పేచీపడడానికందరూ పెద్దలేగదా! అని విస్మయపడింది. ప్రథమ సమాగమంలో నే ప్రణయాన్ని పరాకాష్ట నందించలేదనిగదా, ప్రబంధ పరమేష్ఠిపై తన ప్రియుడికి చిన్నచూపు! అని చింతించింది. మళ్ళీ పొద్దుపొడిచేటప్పటికి ప్రత్యామ్నాయ నాయకుణ్ణి ప్రవేశపెట్టిన వైనం జ్ఞాపకంచేసి పెద్దనయందలి తన పక్షపాతాన్ని ప్రదర్శిద్దామనుకుంది.

"వసంతాలని వ్యర్థంచేసేటంత వెర్రివాడు కాడయ్యా!" అంది. "ఒకరోజు విలంబన చేసినా, అలంబనానికి హాని రానీయలేదుగదా! కొంచెం జాప్యంచేసేడంటే, మరి బుద్ధిజాడ్యం!"

"ఏ వేదంబు పఠించె లూత?"—నందవరీకుడి శ్రోత్రియం మీద నమ్మకంలేని ప్రశ్నని దూసి అడిగేడతడు. అల్లిక కైతలధర్మమూ అని, ధూర్జటి అనువాదం అతికిందని సంతోషించేడు.

"అయినా, కడకి కల్పించినవి కళ్ళుమూసుకు పోయే క్రీడలేగదా!"

"ప్రేమ గుడ్డిదన్నమాట పాతకాలంనాటిదే!" అందామె, వాదానికి తలపడి. "కళ్ళు తెరిచిచూస్తే చెదిరిన కలలు కోట్లు. కథలవిషయం కావాలంటే, కామదహనాన్ని స్మరించు!"

అంత అని ఇంకొకింత కొసిరింది: "పైగా వళ్ళు తెలియని సరసాలకంటె కళ్ళు మూసుకున్న పరసాలే నయం. వధూనఖాగ్రములచే కాయల్గాచిన ధూర్జటి కాయాని కేం తెలుస్తుంది సహసానఖ...సీసంలోని సౌఖ్యం?"

పేచీ మాని ప్రస్తుతమయిన పరిరంభంవైపు మరల్చేడతడు తన దృష్టిని. స్ఫురితచుంబనంలో సంధి చేసుకుని నిరోష్ఠ్యంగా సరసోక్తులు గుసగుసలాడుకున్నారు ప్రియులు. కడకి కళాద్వయం తప్పిన

ఔను - కాదన్న వాదానికి దిగదలచుకోని శ్రీ గొట్టిముక్కల కృష్ణమూర్తిగారు కొత్త "ముందు వెనకలు" మాత్రం చూసుకోండని, పెద్దనకి మూడు శతాబ్దాలకి ముందు మల్లికార్జునుడూ, అయిదుశతాబ్దాల అనంతరం ఆయన రాసిన పద్యాలు ఉదహరించి ఊరుకున్నారు. (మా. భారతి, మార్చి, పుట-60)

"ఔ"నన్నారు శ్రీశ్రీ, చమత్కారానికో, Proletarian Prejudices తోటో. విడెం, భోజనాల వరస అల్లా ఉంచి, అసలు కవితాపితామహుడు కోరిన వేవీ అక్కర్లేదన్నారు.

"అల్లసాని పెదనార్య
డడిగిన నిరుపహతి
స్థలేత్యాదు లనవసరం
సదా కృతిః ప్రభవతి."

సాంతంగా పద్యాన్ని చదువుకున్నాక అంత సాహసంలేని నా స్వగతం గొణిగింది, పెద్దన అడిగినవన్నీ Bourgeois amenities మాత్రమే కాదని.

"స్థలం, విడెం సరే కాని
సదసద్జ్ఞులచే నధి
గతం కాని కృతికి శరణు
కాలోయం నిరవధిః!"

ఈ గందరగోళంలో ప్రబంధం నిబంధనలు చెప్పించుకోవడమే కుదరలేదింతకీ నాకు. కృతి చెయ్యబోతే కోతిచేష్టయిందన్నట్లు పరిణమించిందీ రచన చివరికి. దీనికి శరణేమిటో? ఒప్పితప్పరయు రసజ్ఞులు, ఊహ తెలియుంగల పాఠకోత్తములూ మాత్రమే నిర్ణయించగలరు.

చంద్రుడు కన్నుగీటినట్లు తొంగి మొరిగా చూస్తూంటే, సిగ్గుపడి ఎడబాటయ్యారు.

"వాతెర దొండపండయిందా?" నాచవిగా పరామర్శించిందామె.

ప్రముదితుడు పెదవి చప్పరించేడు. "కదళి నే మించిం దీమాధురీమహిమ!"

"అయితే,

పండుద్రాక్ష పదాలు పాకాన వేసి,

వెండి వెండియు దెచ్చి విందు చేస్తావా?"

ఉవ్విళ్లూరుతూ అడిగింది.

"కవయామి!" అన్నాడు కాబోయే ధూర్జటి, ధీమాగా.

"మరి పెద్దన పోకడలకి స్వస్తేనా?" పక్షపాతం వదలలేక ప్రశ్నించింది.

"వయామి!" అన్నాడతడు చాటువు చెప్పినట్లు.

చివరకు మాట తనమీదుంచుకోవడ మెందుకని, ముగించేడు :

"యామి!"

"...విధావనుకూలే?" మళ్ళీ రావడాన్ని గురించిన మాటందుకుందామె, అనగనగా ఓ అమ్మాయి సంగతి తలుచుకుని.

సతి-సప్తమి సంధినుంచి చాయంగల విన్నపాలై బయటబడ్డవి (బు) ధుడి "ఉదంతం" అతనికీ జ్ఞాపకం వచ్చింది. విధిగా ఆమెకు ధైర్యం చెప్పవలసివచ్చింది, పునరేష్యామీతి...

"బ్రహ్మతర మాతుందిలే!" అన్నా డాశాపూరితంగా. "కాగా, చంద్రుడు మనతోడే!"

ఆ మాటల అర్థం చిత్తగించమని, సెలవు తీసుకొని వెళ్ళిపోయాడతడు, చంద్రుడు తోడుగా. తనకు తోడుగా నిలబడ్డ జాబిల్లి తనకీ సుముఖుడే అని సంతోషించింది చంద్రవదన.

## ఉపోద్ఘాతం

కథను శేషరాత్రి నిద్రబుచ్చి కలం నింపుకున్నాడు కథకుడు. చంద్రుడు చెలియదగ్గరే ఉన్నాడా, వచ్చినాయనతో వెళ్లిపోయాడా? (రాముడంతటివాడు పిలిస్తే రాలేదు కాని కాముడి సహవర్తత ఇతినేః! కళాకళల బుద్ధి!) అన్న జిజ్ఞాసలో ఉండగా ఖరేలుమనే విషయమొకటి ఛురికపోటులాగ జ్ఞాపకంవచ్చింది.

"వెండి వెండియు తెచ్చి..."

ఆ మాటలలో ఆమ్రేడితాన్నిమించిన దోషం తోచింది. నాయికది లోహవ్యామోహమన్న అపోహలో ఆగ్రహంవచ్చింది.

లంచమడగని మంచితనంతో ప్రేమైకజీవిగా ప్రకరణాలు గడుపుతానని తనకిచ్చిన మాటను లెక్కచెయ్యలేదు గణిక! అని కించపడ్డాడు. ఆటవెలది మాట వెలచూస్తే, తన కథ కీ నాయిక ఉచితమైనది కాదని తోచింది. కథ కింతటితో స్వస్తి చెప్పేద్దామనుకున్నాడు.

"కథా, లే..."

కథ లేచి కళ్లు నులుముకుంది. సూర్యకు చీకట్లని తూర్పారబట్టడం, నీలోత్పలం వర్ణాభిమానంతో ముఖం చిన్నబుచ్చుపోవడం వగైరా నిత్యకృత్యాలని పరిశీలనగా చూడడ మయ్యాక, పంకజంతోబాటుపకాలుక ఆవులించింది.

"ఇతి..." ఖచ్చితంగా కథాంతగద్య మొదలుపెట్టేసు కథకుడు.

"ఆహా!" అని ఆవులింత ముగించింది కథ. "ఏం కథ?" అని ఎదురు తిరిగింది.

తన ఫిర్యాదు చెప్పతున్నాడు కథకుడు. "వెండి వెండియు దెచ్చి..." అనువదించేడు.

"నీది ఆశూక్తి రజతభ్రాంతి, అమాయకుడా!" అని మందలించింది కథ, "ఆమె ప్రయోగం అసమర్థనీయమయినా, దానిని మళ్లీ మళ్లీ అర్థం చూసుకో... మళ్లీ" అని హెచ్చరించింది.

"అర్ధకుసి"గా సమాధానపడి ఊరుకున్నాడు కథకుడు.

## ఉపాలంభం

గత రాత్రి విషయం గాలికబురులాగా ఎలా పాకిపోయిందో కాని, పేటపేటంతా ఇలా పాక్కిపోయిందంటే నమ్మండి. ఊరూ వాడా ఏకమై వారిద్దరి విషయమూ పెద్ద ఇదిగా గుసగుసలాడి పోసుకున్నారు.

లోకంనోరు ముయ్యలేమని తెలిసిన నాయకుడు తమ సంగతి నలుగురి నోళ్ళలోనూ ఓ నువ్వుగింజ నానినంతసేపు పడినా ఫరవాలేదనుకున్నాడు. కాని ప్రేయసి వాడమీద ఊరంత కోపంతో పెదవులకు

చేటు తెచ్చుకుంటుందేమోనని మాత్రం భయపడ్డాడు. కానివేళ బయలుదేరి నిత్యముత్తయిదువ గాజుల గలగలలోకి జేరాడు.

సాష్టాంగంగా నాయికను కౌగలించుకుని, వైశంపాయనుడిలాగ విషయాన్ని సవిస్తరంగా చెప్పేడు. పూసగ్రుచ్చినంత శ్రద్ధతో విని, ఆమె కోక పొడుగునా రెపరెప లాడిపోయింది.

"హుఁ! వాడంతా నీలాటిరేవయిపోయిందన్నమాట!" అక్కసుగా మెటిక విరిచింది.

"కన్నెలంతా మనసంగతే కడవలతో తోడుకుపోతున్నారు," అని ముగించేడతడు.

"అనాఘ్రాతపుష్పాలు!" అని ముగ్ధలని ఛీదరించుకుంది. శ్యామ.

మాటమట్టుకు గంభీరంగా అనేసింది కాని అబల గుండె నిబ్బరం కుప్పగా కూలిపోయింది. కలకంఠి కళ్లు చెమ్మగిల్లేయి.

"లోకులు కాకులని తెలిసిన నెఱజాణవు..." స్తుతిలో సాంత్వనానికి పూనుకున్నాడలంకారికుడు.

కాకాసురుడూ, లోకులూ తెచ్చిన సీతాశోకాలని ఇక్ష్వాకుల నాటి ఇతిహాసంనుంచి ఎత్తిచూపిందామె.

"అవింకా కట్టికుడుపుతూనే ఉంటాయా మా స్త్రీజాతిని?" ధనుష్టంకారంలాగ ఎక్కి వెక్కి అడిగింది నారి.

"మనకి రామరాజ్యాల ప్రారబ్ధం తప్పింది," అని హామీ ఇచ్చేడతడు. "లోకాభిరామాయణంగా జనం చెప్పుకునే పుక్కిటిపురాణాలకి. జడిసి అడవిగాచిన వెన్నెలలో విరహానికి గురికానక్కరలేదు!"

ఆమె హృదయాన్ని దిగులుకు తావులేనంత దగ్గరగా తనకు హత్తుకుని, అన్నాడు:

"పైగా, కౌగల కార్యం గాంధర్వంగానే తీర్చుకున్నాము కదూ!"

"ఓ!" అని ఒప్పుకుందామె. "సఖ ముఖాలా!"

మరోక బారెడు-ప్రొద్దెక్కేవు సేపు ఊసూ, పలుకూ ఆడి, ఆమెకోమాత్రపు గుండెదిటవు చేరుకోగానే సెలవు తీసుకుని వెళ్లి పోయాడతడు.

## ఉపద్రష్ట

ఈకథకి కృతిపతిగా ఉండాడని కెవరు సమ్మతిస్తారో తెలియని కథకుడు నలుగురైదుగురు సంపాదకులకి సమానంగా సమన్వయించేటట్లు పత్యంతాలు రాసే కికురింపులో నిమగ్నుడయ్యాడు. అన్యాయత్తచిత్తతలో గత్ప్రకరణం గతి ననుసరించక, కథ ఏకాడికొచ్చిందో తెలియని తికమకలలో పడ్డాడు.

కథని కంచువా కొంగున తనతప్పిదం తెలియనంత, గోప్యంగా ముడివేసి, అపరాహ్ణానికి నాయిక యింటికి జేరుకున్నాడు.

ఉ. కు. రి.

"కశ్త్వే కిం తవ?" కుతూహలాన్నుండబట్టలేని నాయిక నోరు విప్పి అడిగింది.

"తల్లీ నిన్నుగురించి పుస్తకము చేయంబూనితిన్" అని యతి తప్పిన సరాగాలాపనలో కథకుని జవాబు.

"ఇంతవరకూ జరిగిన కథని అడపా - తడపా గ్రథితంచేస్తూనే వచ్చేను. కాని, ఓ చిన్నవిషయం తేలకుండా ఉంది. అంతటి రసికుడు లోకానికి వెరచి..." పెద్దమనిషితనంగా, కీడెంచడానికి నోరురాక, అర్ధోక్తిలో ఊరుకున్నాడు.

నిలువెత్తు ఠీవితో చిరునవ్వు నడ్డంగా ఊపిందామె. నిస్పృత్తంలో సందేహనివృత్తి చేసింది: "...రామరాజ్యాల ప్రారబ్ధం ... లోకాభిరామాయణం...అడవిగాచిన...గురికానక్కర లేదు."

"ఏమో అని భయపడ్డాను," అన్నాడు కథకుడు. "చివరికి విప్రలబ్ధ పాతావేమోనని భయపడ్డాను."

అతని భయాలకి పతాకహస్తాన్నడ్డేసిందామె. ఒక ఛలాన్నీను: "విప్ర—లబ్ధ నేనండీ!" అని.

కళావతి మాటవిరుపు సొగసుకి గుండె నిండింది కథకుడి సహృదయత.

ఆమె అలవోకగా తలపంకించి అనుమంద్రంలో అంది: "మా స్థాయి అనురాగం మహాశయా!"

హమ్మయ్య-గా తల తడుముకున్నాడు మహాశయుడు.

## ఉపాఖ్యానం

అతనిది ఆభాసలోని ఆశ. (పక్కఊరి పడుచుకుర్రాడి మాటలెండి-) ఈ కథసంగతి నామమాత్రంగా తెలుసుకుని ఇది ఇరుమారుమనువు చరిత్ర అనుకున్నాడు. ప్రత్యామ్నాయనాయకభూమికను తాను వహిద్దామనుకున్నాడు.

పొంచి ఉందామని పొలిమేర దాటగానే కథకుని శపనం. పడుచుకుర్రాడు పరామర్శగా మాట జారేడు:

“మన కాలంలో మందుకైనా రసరాట్టు లేదండీ!”

“ఏం బాబూ?” చివుక్కుమన్న చిత్తాన్ని చిరునవ్వు వెనకదాచి ప్రశ్నించేడు కథకుడు.

దండించి దరఖాస్తు పెట్టుకుందామనుకున్నాడు కుర్రాడు.

“లేకపోతే అనుకరణకి అర్థం ఉండొద్దూ? అసలువా డోరమామిడితే, సిసలువాణ్ణి నాచేత చుబుకం పుణికించరాదూ? ఇంతటి ప్రఖ్యాత కథకులు మీరే ఇలాగ...”

“ఉత్పాద్యం, నాయనా, నా కథ!”— మాటకు మాట తెగులుగా అడ్డువచ్చేడు కథకుడు. “ప్రబంధ వ్యామోహంతో పెట్టిన పేరు జూసి పొరబడకు.”

* * *

తెల్లబోయి దిక్కులు చూశేడు దక్షిణుడు. పరకౌయింపుల పరిమితిలో పైట చెంగేదో పిలిచిన వైనం కనబడగా, అందని అందాలకై జాచిన అర్రుల నుపసంహరించుకుని అటు దారితీసేడు.

వెనకనుంచి వెన్నుపొడుగునా హెచ్చరించేడు. కథకుడు: “చొరవజేసి చెంత జేరుదామనుకుంటున్నావేమో, ఛేకానుప్రాసంగా పొమ్మంటుంది సుమా!”

కొత్తలక్ష్యం కవ్వింపులో పెద్దవాని మాటలు పెడచెవిని వేసుకుపోయాడు పడుచుకుర్రాడు.

## ఉ ప జీ వి

యథేచ్ఛగా అసలు ప్రియులు కలుసుకుంటున్నారు. గడిచేనెలలు చెలికి నిండుతూ వచ్చేయి.

“మోహానికి మొహంవాచిపోయేను,” అన్నాడు మగరాయడు, మురిపెంగా.

“మూన్నాళ్ళ ముచ్చటలు మినహాయింపులు కూడా లేనికాలం, మొహం మొత్తిందంటావేమో అని భయపడ్డాను.”

అంతర్వత్ని మృత్సురభిముఖాన్ని మరోసారి ముద్దుపెట్టుకుని అన్నాడతను, కాళిదాసు ప్రమాణంగా: “అధికమాసాలలో కరువొచ్చింది తృప్తికి.”

మనసు కక్కుర్తి మెల్లనలేచి చేతుల గాంతుని జబ్బుగా కౌగలించింది పాతికేళ్ళ (ఎనిమిది నెలల) పడతి.

## ఉ పాం త్యం

నాయికతోబాటు కథకి కూడా ఓపిక సన్నగిలుతోంది. ఒకనాటి ఉదయం ఎంతకీ లేవక, కడుపులో కాళ్లు పెట్టుకుని పడుక్కుంది. పైకనలేదుగాని ఆ కడుపులోనే మరో రెండుపాదాలు మెదిలేయి:

“ఈ నీళ్లు ఎంతదూరం వెళ్ళినా ఇంతే,
వ్యర్థం ఈ ప్రయాణం వెళ్లిపోదాం వెనక్కి.”

ఆ మాటల అర్థంమీదే అలిగి, కథకుడు రాగానే ఖచ్చితంగా చెప్పేసింది. ఇంకొక్క ప్రకరణంకంటె ఎక్కువసాగ లేనని.

“ఇంకెంతో దూరం లేదులే,” అని ఆయన కథని ఒళ్లు నిమిరి, వెంటబెట్టుకుని...

## ఉ ప సం హా రం

...యకాయకి నిండుచూలాలి ఇంటికి జేరుకున్నాడు.

“నీకేమైనా కోరికలుంటే చెప్పు, తల్లీ, అవి తీర్చి మరీ గ్రంథం ముగిస్తాను,” అని అడిగేడు, సాంప్రదాయికంగా.

మొహమాటపడుతూ ఐసిగిందామె: “నాకు మంచి పేరు సంపాదించాలని ఉందండీ!”

“ఆఁ! అన్నట్లు అడగ మరిచేను. నీ నిజనామం?”

చెమ్మగిలిన కళ్లు దించేసుకుని వైస్వర్యంలో అంది: “పడుపు వృత్తిలో పేరు మాసిపోయిందండీ. నేటికాలానికి మీరు సంస్కరించి ఓఇంటిదానిని చేసేరు. అందుకే ఈ ఈప్సితం...ఈడేర్చరూ?” ప్రాధేయపడింది.

“దానికేం తల్లీ!” అన్నాడాయన తండ్రిలాగ. ఓ క్షణంనిదానించి “నీ నిత్యయౌవనానికి తగినట్లు నిన్ను ‘అమ్లాన’ అంటాను,” అన్నాడు.

కాలం మించిపోయిందమాయకుడా అన్నట్లు మందలించేయి ఆమె చిలిపిచూపులు. మాసాష్టకపుటం తర్వత్ని వెలా–తెలా వాడిపోయిన వళ్ళంతనీ పరకాయించుకుంది.

పుత్రోదయం తర్వాతి పూబోడిని మనోజ్ఞంగా ఊహించుకుంది కథ. ప్రస్తుతపు వైవర్ణ్యంలోకూడా ఆమె చెక్కిళ్లెంత అందంగా ఉన్నాయి! ,అని విస్తుపోయింది.

కనుక, “నే నామె కపోలకల్పితాన్నయితే ఎంతసుందరంగా ఉండునో!” అని కథ కలలు కన్నదంటే, లోకం బుగ్గమీద వేలేసుకోనక్కరలేదు!